# మాకేంటీ కర్మ!

- రుణమాఫీ అవుతుందో.. లేదోనన్న అయోమయంలో అన్నదాతలు
- నిత్యం బ్యాంకుల వద్ద పడిగాపులు
- పొంతన లేని సమాధానాలతో అధికారుల దాటవేత
- ఆందోళన బాట పట్టిన కర్షకలోకం

## కొర్రీల్లేకుండా రుణమాఫీ చేయాలి



ఉద్యోగాలిచ్చేందుకు రేషన్‌కార్డు అవసరం లేనప్పుడు.. రుణమాఫీ చేసేందుకు రేషన్‌కార్డు నిబంధన ఎందుకు పెట్టారు. అలాంటప్పుడు ముందే చెప్పాల్సింది. రైతులందరూ బ్యాంకులకు వెళ్లి రుణాలు తీసుకోండి.. అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని ఎందుకు చెప్పారు. ఎన్నికల ముందు చెప్పిందొకటి.. ఎన్నికలయ్యాక చేస్తున్నదొకటి. సాధ్యం కానప్పుడు చెప్పాల్సిన అవసరం లేకుండె. హామీలిచ్చి, ప్రగల్భాలు పలికి ఇప్పుడిలా కొసిరి కొసిరి చేస్తుంటే అనవసరమైన బద్నామ్. ప్రజలు ఎంతో మార్పుకోరి అవకాశమిస్తే ఇలా నట్టేట్లో ముంచేలా వ్యవహరించడం సరికాదు. మాట ప్రకారం కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలి. రేషన్‌కార్డు నిబంధనను ఎత్తేసి పాసుపుస్తకం ఉన్న అందరికీ రూ.2 లక్షల వరకు మాఫీ ఒకేసారి చేయాలి. అప్పుడే చెప్పిన మాట, ఇచ్చిన హామీ సార్థకం అవుతుంది. ఈ కొర్రీలతో రైతులందరినీ తేడాలు చూసి వడ్డిస్తున్నట్లు కనబడుతుంది. ప్రభుత్వంపై నైరాశ్యం నెలకొన్నది. ఆఖరికి బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు చెప్పిన మాటలే నిజమయ్యాయని అనుకుంటున్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేయలేరన్న మాటలను గుర్తుచేసుకుంటూ సీఎం రేవంత్ చేసిన ప్రకటనలను చర్చించుకుంటున్నారు. కేసీఆర్ ఒకేసారి చేయకున్నా కొర్రీలు లేకుండా అర్హులందరికీ చేశాడని చెప్పుకొంటున్నారు. ఎవ్వరికి చెప్పుకోవాలో అర్థంకాక రైతులు నీళ్లు నములుతున్నారు. షరతులు ఎత్తివేసి రుణమాఫీ చేయకుంటే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

*- తిరుపతయ్య, కాంగ్రెస్ మండల నేత, ఆత్మకూరు, వనపర్తి జిల్లా*

## బ్యాంక్ ఎదుట బారులు

- బందోబస్తు మధ్య సిబ్బంది విధులు

అమరచింత, ఆగస్టు 21 : రుణమాఫీలో చాలా మంది రైతుల పేర్లు లేకపోవడంతో బాధితులు బ్యాంకులు, కార్యాలయాలకు పోటెత్తుతున్నారు. ఈ క్రమంలో వివరాలను తెలుసుకునేందుకు బుధవారం మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంక్ వద్దకు భారీగా తరలివచ్చారు. బ్యాంక్ సిబ్బంది తమ విధులకు తీవ్ర ఆటంకం కలుగుతుందని పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకొని బ్యాంక్ బయట మహిళలు, పురుషులకు వేర్వేరు లైన్లు ఏర్పాటు చేశారు. ఒకరి తర్వాత ఒకరిని బ్యాంక్ లోపలికి అనుమతించారు. బ్యాంక్ సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి ఏర్పడింది.



అమరచింత యూనియన్ బ్యాంకు ఎదుట క్యూలో భారీగా నిల్చున్న ప్రజలు



నేతలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

## ఆంక్షల్లేకుండా మాఫీ చేయాలి

- రైతులకు మద్దతుగా చేసే ధర్నాను విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, ఆగస్టు 21 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీలో ఆంక్షలు లేకుండా రైతులకు వర్తింపజేయాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 40 శాతం మంది రైతన్నలకు కూడా రుణమాఫీ కాలేదని, సీఎం రుణమాఫీ పూర్తయిందని చెప్తుంటే మంత్రులు తలా ఓ మాట చెబుతూ రైతులను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. అనేక ఆంక్షలు పెట్టి కర్షకులను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం వారికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని అప్పటిదాకా ప్రభుత్వంపై పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు. ఎన్నికల ముందు మాఫీ అందరికీ వర్తింపజేస్తామని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసిందని గుర్తుచేశారు. ఎన్నికలు కాగానే మాఫీ కోసం రూ.40వేల కోట్లు అవసరమని సీఎం చెప్పారని, కానీ క్యాబినెట్ మాత్రం కేవలం రూ.31 వేల కోట్లకు మాత్రమే అనుమతి ఇచ్చిందన్నారు. బడ్జెట్‌లో రూ.26వేల కోట్లు కేటాయించి కేవలం రూ.18వేల కోట్లు ఖర్చు చేసిందని ఆరోపించారు. రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, అందుకని ధర్నా ద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపించాలన్నారు. గురువారం చేపట్టే రైతుల ధర్నాకు బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు గట్టుయాదవ్, లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, విజయ్‌కుమార్, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూర్ ఎస్‌బీఐ వద్ద తోపులాడుకుంటున్న రైతులు

## టోకెన్ల కోసం తోపులాట

ఊట్కూర్, ఆగస్టు 21 : రుణమాఫీ.. అన్నదాతలను గందరగోళానికి గురిచేస్తున్నది. తమకు లబ్ధి చేకూరిందో లేదో తెలుసుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి అర్హత ఉన్న వారి ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ చేస్తామని చెప్పడంతో బ్యాంకర్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. మండలకేంద్రంలోని ఎస్‌బీఐలో 4వేలకు పైచిలుకు మంది రైతులు రుణాలు పొందగా వీరిలో సగం మందికి పైగా రుణమాఫీ వర్తించకపోవడంతో తమ ఖాతాలను పరిశీలించుకునేందుకు బుధవారం ఉదయం 9గంటలకే బ్యాంకు వద్దకు బారులుదీరారు. కాగా, బ్యాంక్ మేనేజర్ రోజుకు వంద మంది చొప్పున రైతులకు టోకెన్లు అందిస్తామని, వారి ఖాతాలను మాత్రమే పరిశీలించి రుణమాఫీ వివరాలను తెలియజేస్తామని చెప్పడంతో గేటు బయట టోకెన్ల కోసం రైతులు తోపులాడుకున్నారు. దాదాపు 200 మందికి పైగా టోకెన్లు లభించక నిరాశతో ఇంటి ముఖం పట్టారు. మరోపక్క టోకెన్లు దక్కించుకున్న రైతులు తమకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఎందుకు మాఫీ కాలేదని అధికారులను అడిగితే స్పష్టమైన సమాధానం చెప్పడం లేదని వాపోతున్నారు.



లింగనవాయి కెనరా బ్యాంక్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

## అధికారులు స్పష్టతనివ్వాలి

అలంపూర్, ఆగస్టు 21 : ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు రైతుల వ్యవసాయ రుణాలను బేషరతుగా మాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న డిమాండ్ చేశారు. మండలంలోని లింగనవాయి కెనరా బ్యాంక్ ఎదుట బుధవారం బాధిత రైతులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు 22లక్షల మంది రైతులకు రూ.18వేల కోట్ల రుణాలు మాత్రమే రుణమాఫీ చేసిందన్నారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం కనీసం సగం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. అలంపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 395 మంది రైతులు లింగనవాయి కెనరా బ్యాంక్‌లో రుణాలు తీసుకున్నారన్నారు. అయితే, మూడో విడుత రుణమాఫీ జాబితాలో చాలామంది పేర్లు రాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రేషన్ కార్డులో పేరు లేదని, ఆధార్‌లో తప్పులున్నాయని, బాధిత రైతు చనిపోయాడని తదితర సాకులతో రుణాలు మాఫీ చేయడంలేదని ఆరోపించారు. ఇదిలాఉండగా, రూ.2లక్షలకు పైబడిన వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందే విషయంలో అయోమయానికి గురవుతున్నారు. రుణమాఫీకి తాము అర్హులమవుతామా లేదా అని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో వ్యవసాయాధికారులు, బ్యాంక్ అధికారులు స్పష్టత ఇవ్వడంలేదని ఆరోపిస్తున్నారు. సుమారు వంద మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు వ్యవసాయాధికారుల లెక్కల ద్వారా తెలుస్తుందన్నారు. అయితే, బ్యాంకర్లు మాత్రం రూ.2లక్షలు వదిలేసి మిగతా రుణాలు చెల్లిస్తే మాఫీకి అర్హులవుతారని డబ్బులు కట్టించుకుంటున్నారు. కార్యక్రమంలో రైతులు నాగన్న, నాగరాజు, చైతన్య భూషన్న, రాజారెడ్డి, హన్మంతు పాల్గొన్నారు.

## సరైన సమాధానం చెప్పడం లేదు



ఊట్కూర్ ఎస్‌బీఐలో 2023 డిసెంబర్ నాటికి నా పేరుపై రూ.1.60 లక్షల రుణం ఉంది. ఆ తేదీ తరువాత తీసుకున్న లోన్‌తో కలిపి రూ.2.40 లక్షలు ఉన్నది. కానీ అధికారులు మాత్రం రూ. లక్ష లోన్ తీసుకున్నట్లు మాత్రమే తమ వద్ద ఉన్న జాబితాను చూపెడుతున్నారు. రుణమాఫీకి సంబంధించి ఇప్పటివరకు మూడు జాబితాలను విడుదల చేశారు. కానీ, ఎందులోనూ నా పేరు లేదు. నిత్యం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాను. బ్యాంకోళ్లను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. వ్యవసాయ అధికారులను అడిగితే కూడా పొంతన లేకుండా మాట్లాడుతున్నారు.

*- ఎల్కోటి మల్లారెడ్డి, రైతు ఊట్కూర్*

## పదిశాతం మందికే లబ్ధి

- 2,459లో 220 మందికే రుణమాఫీ..
- వ్యవసాయ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

హన్వాడ, ఆగస్టు 21 : మండలంలోని రైతు సేవా సహకార సంఘం బ్యాంక్‌లో మొత్తం 2,459 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. రుణమాఫీ కోసం డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 19, 2023 మధ్య రుణాలు తీసుకున్న రైతుల పేర్లు పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 401మంది రైతుల పేర్లు పంపించగా వీరిలో 220మందికే రుణమాఫీ వచ్చింది. వీరిలో రూ.లక్ష లోపు ఉన్న వారు 201మంది, రూ.1.50 లక్షల లోపు ఉన్నవారు 17మంది, రూ.2 లక్షల వరకు ఉన్న వారు ఇద్దరికి మాత్రమే రుణమాఫీ రావడంతో రైతులు ఆయోమయంలో పడ్డారు. ఏపీజీవీబీలో వెయ్యి మంది రుణాలు తీసుకుంటే 705 మందికే రుణమాఫీ అయ్యాయి. మిగతా వారికి కాలేదు. హన్వాడ ఎస్‌బీఐలో 1,500 మందికి రుణాలు తీసుకోగా కేవలం 450 మందికి రుణమాఫీ వచ్చింది. మిగతా వారికి రేషన్ కార్డులో పేరు లేదని, ఆధార్‌లో తప్పులున్నాయని, బాధిత రైతు చనిపోయాడని, తదితర సాకులతో రుణాలు మాఫీ చేయలేదు. ఇలా మూడు జాబితాల్లో పేర్లు రాని రైతులు వ్యవసాయ, బ్యాంక్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మాకు ఎందుకు మాఫీ కాలేదని అడిగితే అధికారుల నుంచి సరైన సమాధానాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరివి ఒకే రేషన్ కార్డులో ఇద్దరు పేర్లు ఉంటే రుణమాఫీ రావడంలేదని చెబుతున్నారు. రైతులను మోసం చేసిన ప్రభుత్వానికి ఉసురు తాకుతుందని శాపనార్థాలు పెడుతున్నారు.



బ్యాంకు అధికారులను అడుగుతున్న రైతులు



వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న అన్నదాతలు

## కేసీఆర్ ప్రభుత్వంలో అందరికీ..



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. సాగు చేయడానికి గతేడాది రూ.లక్షా ఇరవై వేలు లోన్ తీసుకున్నాను. రెండో విడుతలో రుణం మాఫీ అవుతుందని ఆశపడ్డా, కానీ కాలేదు. మూడు వారాల నుంచి బ్యాంక్, వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. మూడో విడుత జాబితాలోనైనా పేరు వస్తుందేమోనని చూశాను. కానీ, ఇప్పటివరకు నాకు రుణమాఫీ వర్తించలేదు. మోకాళ్ల నొప్పితో బాధపడుతూ కాళ్లరిగేలా నిత్యం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాను. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కండీషన్లు పెట్టకుండా అందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి. నాలాంటి రైతుల గోసను తీర్చాలి. కేసీఆర్ సర్కారు హయాంలో అందరికీ మాఫీ అయ్యింది.

*- ఏ.శాంతమ్మ, దళిత మహిళా రైతు, కొత్త ఎస్సీ కాలనీ, అమరచింత, వనపర్తి జిల్లా*

## పొలం పనులు విడిచిపెట్టి..



పాస్‌బుక్కులు మాత్రమే చూసి రుణం ఇచ్చిన బ్యాంకోళ్లు.. ఇప్పుడు రుణమాఫీ విషయంలో మాత్రం రేషన్‌కార్డులో ఇద్దరు ఉన్నారు.. ఆధార్‌లో, పాస్‌బుక్‌లో పేరు తప్పుంది అని కుంటిసాకులు చెబుతున్నారు. నేను గతేడాది రూ.2 లక్షల లోన్ తీసుకున్నాను. నా భార్య పేరు మీద రూ.1.40 లక్షలు తీసుకొని రెన్యూవల్ చేసుకున్నాం. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఇద్దరిలో ఒకరికి రుణమాఫీ వర్తిస్తుందని ఎదురుచూశాం. రెండు, మూడో విడుత జాబితాలో ఎవరి పేరూ రాలేదు. ఇప్పుడు వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. పొలంలో కూలీలను పెట్టి మేము పనులు వదిలేసి మాఫీ కోసం తిరుగుతున్నాం.

*- మధుగాని నాగరాజు, రైతు, అమరచింత, వనపర్తి జిల్లా*

## మాఫీ చేస్తానని మోసం..



ఎన్నికలకు ముందు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని కాంగ్రెసోళ్లు చెప్పారు. ఇప్పుడు రేషన్‌కార్డు అంటూ, పేర్లు మ్యాచ్ కావడం లేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశాడు. నాకు రూ.70 వేలు వ్యవసాయం రుణం ఉంది. ఇప్పటికీ ఒక్క పైసా మాఫీ కాలేదు. అధికారులను అడిగితే పొంతనలేని సమాధానం చెబుతున్నారు. ఇక మాఫీ అయితదన్న నమ్మకం నాకైతే లేదు.

*- గోరటి వెంకటయ్య, రైతు, కుప్పగండ్ల గ్రామం, వెల్దండ మండలం*

## పైసా కూడా రాకపాయె..



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఒకటి అమలు చేయలేదు. పేరుకే రైతు ప్రభుత్వం రైతుకు చేసింది ఏమిలేదు. రుణమాఫీ అన్నారు.. ఇంతవరకు పైసా కుడా మాఫీ కాలేదు.. నేను రూ.70వేలు రుణం తీసుకున్నాను. వడ్డీతో కలిపి రూ. లక్ష దాటింది. ఎన్ని లిస్టులు చూసినా నా పేరు రాకపాయె. ఈ ప్రభుత్వాన్ని ఎలా నమ్మాలి.. ఒక్క పని సక్కగా లేదు.. కేసీఆర్ ప్రభుత్వమే నయ్యముండేనని గిప్పుడనిపిస్తుంది..

*- మెరుగు రంగయ్య, రైతు, కుప్పగండ్ల గ్రామం, వెల్దండ మండలం*

## రూ.2 లక్షల లోపు ఉన్నా..



నాకు పల్లెపాడు శివారులో మూడెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. గతేడాది నవంబర్‌లో లింగనవాయి కెనరా బ్యాంక్‌లో రూ.2 లక్షలు రుణం తీసుకున్నాను. ప్రభుత్వం విడుదల చేసిన మూడో విడుత జాబితాలో పేరు వస్తుందని భావించా. అయినా రాలేదు. అధికారులను అడిగితే ఇదిగో.. అదిగో అంటున్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. మూడో విడుత వరకు వేచి ఉన్నప్పటికీ ఫలితం లేకపోయింది.

*- సుంకులన్న గౌడ్, పల్లెపాడు గ్రామం, అలంపూర్ మండలం*

## మభ్యపెడుతున్న సర్కారు..



గతేడాది నవంబర్‌లో లింగనవాయి కెనరా బ్యాంక్‌లో రూ.2 లక్షల రుణం తీసుకున్నాను. ప్రభుత్వం ఇచ్చిన మూడో విడుత జాబితాలో నా పేరు రాలేదు. రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని చెబుతూ ప్రభుత్వం రైతులను మభ్యపెడుతున్నది. రేషన్‌కార్డులు లేవని, ఆధార్ స్థానికంగా లేదని నానా షరతులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నది. ఎన్నికల ముందు అబద్దాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని పట్టించుకుంటలేదు.

*- కుమ్మరి జమ్మన్న, పల్లెపాడు గ్రామం, అలంపూర్ మండలం*

## రాష్ట్రాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తాం

- పాలమూరుకు రూ.5 కోట్లు మంజూరు
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- సందర్శకులకు అందుబాటులోకి పునరుజ్జీవ పిల్లలమర్రి

మహబూబ్‌నగర్, ఆగస్టు 21 : రాష్ట్రాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తామని పర్యాటక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ సమీపంలో ఆసియాలోనే రెండో అతిపెద్ద, ప్రాముఖ్యత ఉండి పునరుజ్జీవం పోసుకున్న పిల్లలమర్రి వృక్షాన్ని బుధవారం ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో కలిసి మంత్రి ప్రారంభించి సందర్శకులకు అందుబాటులోకి తెచ్చారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పిల్లలమర్రి, మినీ ట్యాంక్ బండ్, పాత కలెక్టరేట్ పరిధిలో నిర్మాణంలో ఉన్న త్రీస్టార్ హోటల్, కేసీఆర్ ఎకో అర్బన్ పార్కు, శిల్పారామంలో చేపట్టిన, చేపట్టాల్సిన పనులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పిల్లలమర్రి వద్ద రెస్టారెంట్, లాండ్స్కేప్‌తోపాటు పర్యాటకులకు అవసరమైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. టూరిజం అభివృద్ధిలో రాష్ట్రంలోనే పాలమూరులో మొదటి విడుత వసతుల కల్పనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా వెంటనే రూ.5 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలోనే అతిపెద్దదైన కేసీఆర్ ఎకో పార్కు బాగుందన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న మినీ ట్యాంక్ బండ్‌కు పర్యాటకులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నదని, అందుకే అక్కడ పనులను పూర్తి చేసే విషయంపై దృష్టి సారించాలన్నారు. అలాగే మినీ ట్యాంక్ బండ్‌ను దగ్గరలో ఉన్న కాల్వ ద్వారా కృష్ణా నీటితో నింపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని అన్నారు. అలాగే మినీ శిల్పారామం, ట్యాంక్ బండ్, ఎకో పార్కులోని వాచ్ టవర్‌ను వారు సందర్శించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, పర్యాటక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్, పర్యాటక శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, పర్యాటక శాఖ చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ విజయ్, డీఈ పరుశవేది, జిల్లా పర్యాటక ఇన్‌చార్జి అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## అయిజలో విషాదం

- గుడిసె గోడకూలి చిన్నారి మృతి
- మరో నలుగురికి గాయాలు
- ఎమ్మెల్యే విజయుడు పరామర్శ

అయిజ, ఆగస్టు 21 : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోడ కూలిపడడంతో చిన్నారి మృతి చెందగా మరో నలుగురికి గాయాలైన సంఘటన అయిజలో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని 14వ వార్డులో చాకలి నర్సింహులు భార్య రేవతి, కుమారులు ప్రణీత్, హరీశ్, కూతురు శ్రీకృతితో కలిసి పూరి గుడిసెలో నివసిస్తున్నాడు. వీరి కూతురు శ్రీకృతి(8) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతుండగా.. ఇద్దరు మగపిల్లలు అలంపూర్‌లోని బీసీ వసతి గృహంలో ఉంటూ చదువుతున్నారు. అయితే రాఖీ పండుగ సందర్భంగా ఇద్దరు కుమారులు ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులు గుడిసెలో నిద్రకు ఉపక్రమించారు. వర్షాలు కురుస్తుండడం.. లోతట్టు ప్రాంతంలో ఉండడంతో గుడిసె వెనుకభాగంలో వర్షం నీరు చేరడంతో తడిచిన గోడ 10 గంటల సమయంలో కూలిపడింది. వెంటనే తేరుకున్న దంపతులు గాయాలైన పిల్లలను బయటకు తీశారు. అయితే శ్రీకృతిపై సెల్ఫ్ బండలు పడడంతో వెంటనే స్థానిక ప్రైవేటు దవాఖానకు తరలించగా.. పరిస్థితి విషమించడంతో కర్నూల్ కిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నర్సింహులుకు స్వల్ప గాయాలు కాగా.. రేవతితోపాటు ఇద్దరు పిల్లలు అయిజ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. అయితే రాఖీ పండుగ రోజే సంఘటన జరగడంతో ఆ కుటుంబంతోపాటు పట్టణంలో విషాదం చోటుచేసుకున్నది. బాధిత కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. కర్నూల్ ప్రభుత్వ దవాఖానలో చిన్నారి భౌతికకాయాన్ని పరిశీలించి ఘటన తీరుపై ఆరా తీశారు. ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బాలిక తల్లి, చిన్నారుల పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే తాసీల్దార్ జ్యోతి, కమిషనర్ లక్ష్మారెడ్డి పరామర్శించారు.





కూలిన గోడ, (ఇన్‌సెట్లో) మృతి చెందిన చిన్నారి (ఫైల్), కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే